## క్లుప్తంగా

### కేజీబీవీలో వైద్యశిబిరం



నెక్కొండ : మండలంలోని పెద్దకోర్పోలులోని కేజీబీవీలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 104 మందికి విద్యార్థులకు వైద్యాధికారి అఖిల్ పరీక్షలు నిర్వహించి 46 మందికి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. పరీక్ష సమయంలో ఆరోగ్యం కీలకమన్నారు. చదువుతోపాటు ఆహారం, నిద్ర, వ్యాయామంపై దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో విద్యాలయ స్పెషల్ ఆఫీసర్ రజిత, పీహెచ్‌సీ సూపర్‌వైజర్ రమాదేవి, ఏఎన్‌ఎం కరుణ, ఆశ కార్యకర్త జ్యోతి, ఉపాధ్యాయులు సరిత, విజయశ్రీ, లక్ష్మి, అనిత, భార్గవి, గౌతమి, శోభ, సునీత, తదితరులు పాల్గొన్నారు.

### కళ్లద్దాల పంపిణీ



నల్లబెల్లి : మండల కేంద్రంలోని కేజీబీవీలో 8 మంది విద్యార్థినులకు ఆర్‌బీఎస్‌కే మెడికల్ ఆఫీసర్ స్వర్ణలత సోమవారం కళ్లద్దాలు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించగా ప్రభుత్వం కళ్లద్దాలు అందజేసిందని చెప్పారు. విద్యార్థులు కళ్ల పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ భవిత, ఫార్మసిస్ట్ స్మిత, ఎస్‌ఎం జులేఖ, విద్యాలయ ఎస్‌ఓ ఆవుల సునిత, ఏఎన్‌ఎం జ్యోతి పాల్గొన్నారు.

### సన్మానం



నర్సంపేట : ప్రపంచ వినియోగదారుల వారోత్సవాల సందర్భంగా బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పట్టణానికి చెందిన వినియోగదారుల సమాచార కేంద్రం జిల్లా అధ్యక్షుడు గిరగాని సుదర్శన్‌ను రాష్ట్ర వినియోగదారుల హైకోర్టు జడ్జి మీనా రామనాథన్, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ చైర్మన్ చౌరాసియా, కార్యదర్శి వెంకటేశ్వర్లు సోమవారం సన్మానించారు.

### 'ఎస్‌ఆర్‌ఆర్' వితరణ

రాయపర్తి : మండలంలోని మైలారం గ్రామానికి చెందిన చిర్రపంగ కుటుంబాలకు ఎల్లమ్మ ఆలయ భూమి కొనుగోలు కోసం ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్‌ఎస్ నేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం రూ.50 వేల సాయం అందజేశారు. అనంతరం గుబ్బడి బోడుతండాకు చెందిన ప్రజలకు దుర్గమ్మ పండుగ నిర్వహణ కోసం రూ.15 వేలు నగదు అందించారు. కార్యక్రమాల్లో ఎస్టీ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేందర్, నాయకులు రంగారెడ్డి, దేవేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సంతోశ్, గజవెల్లి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

### గీత కార్మికుడికి గాయాలు

సంగెం : తాటిచెట్టు మీద నుంచి పడి గీత కార్మికుడికి గాయాలైన ఘటన మండలంలోని ఆశాలపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలిలా.. గ్రామానికి చెందిన చీకటి కొమురయ్య తాటిచెట్టు ఎక్కుతుండగా కిందపడిపోయాడు. ఆయన్ను ఎంజీఎంలో చేర్చారు.

### నేడు మామిడి కాపు వేలం

నర్సంపేట : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని మామిడి తోట ప్రస్తుత సంవత్సర కాపును నేడు (మంగళవారం) వేలం వేయనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లం నవీన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వ్యక్తులు మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు కళాశాలలో నిర్వహించనున్న వేలంకు హాజరు కావాలని పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం సెల్ నంబర్ 9849343206లో సంప్రదించాలని సూచించారు.

**రేపు అంగడికి..**

రాయపర్తి : మండల కేంద్రంలో గురువారాల్లో నిర్వహించే అంగడికి రేపు (బుధవారం) వేలం నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి వల్లె వినోద్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీఓ కూచన ప్రకాశ్ సమక్షంలో గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో వేలం ఉంటుందని పేర్కొన్నారు. వివరాల కోసం సెల్ నంబర్ 9502078283లో సంప్రదించాలని కోరారు.

### రైస్ మిల్లులపై ఫిర్యాదు

వర్ధన్నపేట : ప్రభుత్వ అనుమతులు లేకున్నా రైస్ మిల్లులు నడుపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆర్‌ఎస్‌పీ) జిల్లా కార్యదర్శి వల్లందాసు కుమార్ ప్రజావాణిలో కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. వ్యవసాయ మార్కెట్ పరిధిలో 26 రైస్ మిల్లులు ఉండగా అందులో కేవలం మూడు మిల్లులకు మాత్రమే ప్రభుత్వ అనుమతి ఉందని తెలిపారు.

# కంకర పోశారు.. బీటీ మరిచారు

- 22 నెలలుగా నిర్లక్ష్యం
- మాధన్నపేట-భోజ్యానాయక్‌తండా వాసులకు తప్పని తిప్పలు



కంకర తేలిన దుస్థితిలో భోజ్యానాయక్‌తండా రోడ్డు

నర్సంపేట రూరల్ : మండలంలోని మాధన్నపేట-భోజ్యానాయక్‌తండాలకు మధ్య అధికారులు కంకర పోశారు.. బీటీ మరిచారు.. అన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 2022 మే నెలలో రోడ్డు పనులు ప్రారంభించగా 22 నెలలు గడచినా నిర్లక్ష్యమే కొనసాగుతోంది. కంకర పోసి బీటీ వేయకపోవడంతో రోడ్డుపై రాకపోకలు సాగించాలంటే మాదన్నపేట, భోజ్యానాయక్‌తండా వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రమాదాలు జరిగిన సందర్భాలూ ఉన్నాయి.

నర్సంపేట మండలంలోని మాధన్నపేట నుంచి భోజ్యానాయక్‌తండాకు వెళ్లే రోడ్డు సుమారు రెండు కిలోమీటర్ల మేర ఉంటుంది. రెండు గ్రామాలకు మధ్య రైతులు వ్యవసాయ భూములున్నాయి. నిత్యం ప్రజల రాకపోకలు సాగుతుంటాయి. భోజ్యానాయక్‌తండా నుంచి నర్సంపేటకు రావాలంటే మాధన్నపేట మీదుగా అయితే దూరం తక్కువ. లేదంటే చుట్టూ తిరిగి రావాల్సి ఉంటుంది. ఈ రెండు గ్రామాలకు మధ్య సుమారు రెండు కిలోమీటర్ల రోడ్డుకు గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 2022లో నాటి ప్రభుత్వం రూ.72 లక్షల అంచనా వ్యయంతో బీటీ రోడ్డు మంజూరు చేసింది. నాటి ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పనులను ప్రారంభించారు. కాగా కాంట్రాక్టర్ పనులను నత్తనడక సాగించాడన్న అపవాదు ఉంది. మట్టి రోడ్డును తవ్వి కంకర పోసి చేతులు దులుపుకున్న దారుణం నెలకొంది. ఆ రోడ్డు మీదుగా వెళ్లాలంటే రెండు గ్రామాల ప్రజలకు నరకం కనిపిస్తోందంటే అతిశయోక్తి లేదు. ఇకనైనా ప్రభుత్వం, అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

**తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం**

మాధన్నపేట-భోజ్యానాయక్‌తండా నడుమ రోడ్డు మంజూరు కాగా కాంట్రాక్టర్ కంకర పోసి వదిలేశారు. రెండేళ్లు గడచినా రోడ్డు నిర్మాణం పూర్తి చేయకపోవడంతో రోడ్డుపై కంకరతో వాహనాలు ప్రమాదాల బారిన పడుతున్నాయి. పంట పొలాలకు యూరియా, ఇతర బస్తాలు తీసుకెళ్లాలన్న, పంట ఉత్పత్తులు తీసుకురావాలన్నా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం.

\- కొత్తకొండ రాజమౌళి, రైతు, మాధన్నపేట

**రాత్రివేళల్లో రాకపోకలు కష్టం**

కంకర రోడ్డుపై రాకపోకలు సాగించాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పొలాలకు పురుగు మందులు, ఇళ్లకు పంట ఉత్పతులు తీసుకెళ్లడంలో నానా తంటాలు పడుతున్నాం. ఏదైనా పని ఉండి వెళ్లాలంటే నరకం కనిపిస్తోంది. కంకర తేలి ఉండడంతో రాత్రివేళల్లో రాకపోకలు మరింత కష్టంగా మారాయి. వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్న దుస్థితి నెలకొంది.

\- అనుమాల రమేశ్, గ్రామస్తుడు, మాధన్నపేట

# స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటుతాం

- బీజేపీ రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి



కండువా కప్పుతున్న శ్రీనివాస్‌రెడ్డి

రాయపర్తి : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటుతామని బీజేపీ రాష్ట్ర నాయకుడు కర్ర శ్రీనివాస్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని జయరాంతండా(ఎస్)లో కాంగ్రెస్ నాయకుడు భూక్య నరేందర్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన రమేశ్, నవీన్, భీక్యా, సురేశ్, సుందర్, తదితరులు సోమవారం బీజేపీలో చేరగా వారికి శ్రీనివాస్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. ప్రధాని మోదీ రాష్ట్రానికి భారీగా నిధులు కేటాయిస్తున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాల్లోనూ కేంద్ర ప్రభుత్వ నిధులున్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. ప్రజలను చైతన్యవంతం చేసి పంచాయతీ ఎన్నికల్లో జయకేతనం ఎగరేస్తామన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు నూనె అనిల్, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ పూసల శ్రీమాన్, నాయకులు వడ్లకొండ రవి, ఎనగందుల శ్రావణ్, బూర్గు నవీన్, పెండ్యాల గణేశ్, భద్రునాయక్, సురేశ్ నాయక్, మంచాల సుమన్, సందీప్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

### చేతిపంపు ప్రారంభం



నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని కాల్‌నాయక్‌తండాలో ఏర్పాటు చేసిన చేతిపంపును చీర్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బత్తిని అశోక్‌గౌడ్ సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఏంజెల్ హౌస్ వెల్ సొసైటీ ఆధ్వర్యంలో తండావాసులకు తాగునీటి సౌకర్యం కల్పించే దిశగా చేతిపంపు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మెరుగు కుమారస్వామి, లావుడ్య తిరుపతి, అంగోతు గోవిందు, గుల్లపల్లి రమేశ్, దొమ్మటి కార్తీక్, ఆకుల ఉదయ్, శివ, నవీన్, మణికంఠ, రాకేశ్, అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

### ఎంఈఓగా బాధ్యతల స్వీకరణ

నల్లబెల్లి : మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ)గా నందిగామ హైస్కూల్ హెచ్‌ఎం అనురాధ సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఆమెకు పూర్తి స్థాయి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) జ్ఞానేశ్వర్ ఉత్తర్వులు జారీ చేయడంతో ఆమె ఎమ్మార్సీలో సోమవారం విధులు చేపట్టారు. ఆమెకు ఎంఐఎస్ కోఆర్డినేటర్ రాజేశ్వరి, సీఓ విజయ్, ఐఆర్‌టీ సంధ్య, సీఆర్పీలు రవి, వెంకటయ్య, రాంబాబు, మెసేంజర్ ఆనందం తదితరులు పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు.

### ఎక్స్‌లెన్స్ అవార్డు



వర్ధన్నపేట : మండలంలోని ఇల్లందకు చెందిన తక్కళ్లపెల్లి సత్యనారాయణరావును స్పందన ఎక్స్‌లెన్స్ అవార్డు వరించింది. ఎంఆర్‌సీబీ పేరుతో వ్యాపారం చేయడంతోపాటు సామాజిక సేవలు నిర్వహిస్తూ తన వద్ద పని చేస్తున్న 23 మంది కార్మికులకు జీవనోపాధి కల్పించిన క్రమంలో హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా అవార్డు అందజేశారు.

### 21 నుంచి టెన్త్ పరీక్షలు

నర్సంపేట రూరల్ : ఈనెల 21 నుంచి పదో తరగతి పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ కొర్ర సారయ్య తెలిపారు. పట్టణంలోని మండల వనరుల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పరీక్ష ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఉంటుందని చెప్పారు. పట్టణంలో ఆరు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షల నిర్వహణకు ఇన్విజిలేటర్లతోపాటు డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, చీఫ్ సూపరింటెండెంట్, సిట్టింగ్ స్క్వాడ్‌లను నియమించినట్లు తెలిపారు. మండలంలో 1100 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని వివరించారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు వైద్య, నీటి, ఇతర వసతులు కల్పించినట్లు చెప్పారు.

# విద్యార్థుల ఉన్నతే లక్ష్యంగా కార్యాచరణ





సమావేశంలో మాట్లాడుతున్న రాణాప్రతాప్‌రెడ్డి

- బీజేపీ ప్రధాన కార్యదర్శి రాణాప్రతాప్‌రెడ్డి

నర్సంపేట : విద్యార్థుల ఉన్నతే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యాచరణ చేపడుతోందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రధానమంత్రి స్కూల్ ఆఫ్ రైజింగ్ పథకానికి ఎంపికైన చెన్నారావుపేట మండలంలోని అమీనాబాద్ మోడల్ స్కూల్‌ను సోమవారం ఆయన సందర్శించి మాట్లాడారు. నాణ్యమైన విద్యతో వ్యక్తి, జాతి నిర్మాణం జరిగి సౌశీల్యవంతమైన భారత్ సాకారమవుతుందని చెప్పారు. నీతివంతమైన సమాజ నిర్మాణం కోసం విద్యార్థులకు ప్రాథమిక స్థాయిలోనే నాణ్యమైన విద్య అందించే దిశగా కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి స్కూల్ ఆఫ్ రైజింగ్ ఇండియా ప్రవేశపెట్టిందని తెలిపారు. మోడల్ స్కూల్ విద్యార్థులకు ఐదేళ్లలో మౌలిక వసతులు, మేధోసంపత్తి పెంపునకు ప్రభుత్వం రూ.కోటి ఖర్చు చేయనుందన్నారు. ఏటా రూ.20 లక్షల వ్యయంతో విద్యార్థులను విజ్ఞాన, విహారయాత్రకు తీసుకెళ్తుందని చెప్పారు. యూనిఫారాలు, పాఠ్యపుస్తకాలు ఉచితంగా అందజేస్తారని తెలిపారు. సైన్స్, మ్యాథ్స్ ల్యాబరేటరీలు ఏర్పాటు చేస్తారని వివరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు ఉపకార వేతనాలు, రుచికరమైన పౌష్టికాహారం, డిజిటల్ తరగతి గదులు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు దామరుప్పుల శేఖర్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు దుంకదువ్వ రంజిత్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్చ దయాకర్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి ఎర్ర రాజు, బీజేవైఎం మండల అధ్యక్షుడు నవీన్‌రెడ్డి, నాయకులు వనపర్తి మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

**పరీక్ష సామగ్రి అందజేత**

అమీనాబాద్ మోడల్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు బీజేపీ నాయకుడు వరదుల చంద్రశేఖర్ సమకూర్చిన పరీక్ష సామగ్రిని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ రాణాప్రతాప్‌రెడ్డి సోమవారం అందజేసి మాట్లాడారు. విద్యార్థులకు పెన్నులు, స్కేళ్లు, పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు దామెరుప్పుల రాజశేఖర్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు దుంకదువ్వ రంజిత్, సీనియర్ నాయకుడు వనపర్తి మల్లయ్య, బీజేవైఎం జిల్లా కార్యదర్శి ఎర్ర రాజు, బీజేవైఎం మండల అధ్యక్షుడు కొనుకటి నవీన్, సోషల్ మీడియా మండల కన్వీనర్ కీసరి సాంబరాజు, నాయకులు మామిడాల రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

# కల్యాణం అధికారికంగా నిర్వహించాలి

- అఖిల భారత రాష్ట్ర ప్రచారకుడు రాములు



వడ్ల ప్యాకెట్లు అందజేస్తున్న రాములు

నల్లబెల్లి : సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని పల్లెల్లోనూ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని అఖిల భారత హనుమాన్ రాష్ట్ర ప్రచారకుడు గాదెపాక రాములు కోరారు. మండలంలోని నాగరాజుపల్లిలోని హనుమన్ ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీతారాముల కల్యాణంలో ప్రజల భాగస్వామ్యంతో నిష్ఠతో తయారు చేసిన గోటి తలంబ్రాలనే వినియోగించాలని ఆకాంక్షించారు. ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా పలు గ్రామాల్లో ఇప్పటికే 1200 వడ్ల ప్యాకెట్లు అందజేశామని, మరో 1600 ప్యాకెట్లు అందజేస్తామని తెలిపారు. అనంతరం నాగరాజుపల్లిలో మాజీ సర్పంచ్ గోనె శ్రీదేవికి 104 ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో హనుమన్ ప్రచారకులు సాంబయ్య, లింగారెడ్డి, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

# 'వర్గీకరణ' తర్వాతే నియామకాలు చేపట్టాలి

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు ప్రతాప్

నల్లబెల్లి/పర్వతగిరి/సంగెం : ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాకే ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలు చేపట్టాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు బొట్ల ప్రతాప్, బిర్రు మహేందర్, చాతాళ్ల రమేశ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో నల్లబెల్లి, పర్వతగిరి, సంగెం మండలాల్లో సోమవారం నిర్వహించిన దీక్షలకు సదరు నాయకులు హాజరై సంఘీభావం తెలిపి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణ పట్ల మోసపూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ వర్గీకరణ సాధన కోసం శాంతియుతంగా దీక్షలు చేస్తున్నా ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి పట్టించుకోవడం లేదని ఆందోళన వెలిబుచ్చారు. ఎస్సీలను 'ఏబీసీడీ' గ్రూపులుగా విభజించాలని ఆకాంక్షించారు. కార్యక్రమాల్లో నాయులు పరికి కోర్నెల్, బొమ్మకంటి అనిల్, నత్తి శ్యామ్, పాలెపాక అరుణ్, బర్ల యాకయ్య, మాసాని గోపాల్, కట్కూరి వెంకట్, దామెర కిశోర్, కోదూరి రాజు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు అభినందన



నెక్కొండ : ఈనెల 15న హైదరాబాద్‌లో నిర్వహించిన ఉగాది పురస్కార పాటల పోటీలో ప్రతిభ చాటిన స్థానిక విద్యోదయ గురుకుల స్కూల్ విద్యార్థులు పూర్ణిమ, సాత్వికలను కరస్పాండెంట్ చల్లా నాగార్జున్‌రెడ్డి స్కూల్ ఆవరణలో సోమవారం అభినందించారు. అనంతరం కరస్పాండెంట్ మాట్లాడారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించిన పాటల పోటీల్లో విద్యార్థులు ప్రతిభ చాటారని చెప్పారు. విద్యార్థులు ఉగాది పురస్కారంతోపాటు ప్రశంస పత్రం అందుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ చల్లా పారిజాతం, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మహ్మద్ షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

# అడవుల పెంపకం సామాజిక బాధ్యత

- ఎఫ్‌ఆర్‌ఓ రవికిరణ్



మాట్లాడుతున్న ఎఫ్‌ఆర్‌ఓ రవికిరణ్

ఖానాపురం : అడవుల పెంపకాన్ని సామాజిక బాధ్యతగా ఎఫ్‌ఆర్‌ఓ రవికిరణ్ అభివర్ణించారు. మండలంలోని బుధరావుపేట మోడల్ స్కూల్‌లో 'అడవుల ప్రాముఖ్యత-సంరక్షణ' అంశంపై సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ భూభాగంలో 33 శాతం అటవీ ప్రాంతం ఉండాల్సి ఉండగా భారత్‌లో 25 శాతం మాత్రమే అటవీ ప్రాంతం ఉందని చెప్పారు. సమాజంలోని ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని సూచించారు. తద్వారా అటవీ విస్తీర్ణం పెంపులో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. అటవీ పరిరక్షణతోనే జీవవైవిధ్యం పెంపొందుతుందని, అనేక జీవరాసులు మనుగడ సాగిస్తాయని, పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని వివరించారు. విద్యార్థి దశలోనే అడవుల పెంపకంపై అవగాహన పెంచుకుని చైతన్యవంతం కావాలని సూచించారు. సమావేశంలో ఎఫ్‌ఎస్‌ఓ సోమా, బీట్ ఆఫీసర్ రఘురాం, స్కూల్ ప్రిన్సిపాల్ సునీత, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# మానవ అక్రమ రవాణాను నిర్మూలించాలి

- ఏపీఎం వేణు, శిక్షకుడు కిరణ్



కరపత్రాలు ప్రదర్శిస్తున్న ఏపీఎంలు, తదితరులు

వర్ధన్నపేట : మహిళలు సంఘటితమై మానవ అక్రమ రవాణాను నిర్మూలించాలని ఏపీఎం వీర్ల వేణు, శిక్షకుడు కిరణ్ ఆకాంక్షించారు. మండల కేంద్రంలోని బృందావన మండల సమాఖ్య కార్యాలయంలో ప్రతినిధులకు, వీఓఎలకు సోమవారం ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సులో వారు మాట్లాడారు. కొందరు మాయమాటలతో అమాయకులను కిడ్నాప్ చేసి బాండెడ్ లేబర్‌గా, సెక్స్ వర్కర్లుగా మార్చుతున్నారని తెలిపారు. నిస్సహాయులైన పేదల అవసరాలను ఆసరా చేసుకుని ఉద్యోగాలు, ఉపాధి పేరుతో వంచనకు పాల్పడుతున్న వారి పట్ల సమాజం అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. చిన్నారులను కిడ్నాప్ చేసి భిక్షాటన చేయిస్తున్న, లైంగిక వాంఛ తీర్చుకుంటున్న దుస్థితి నెలకొందని ఆందోళన వెలిబుచ్చారు. తొలుత మానవ అక్రమ రవాణాపై అవగాహన కల్పించేలా ముద్రించిన కరపత్రాలను విడుదల చేశారు. సమావేశంలో సమాఖ్య ప్రతినిధులు అరుణ, పల్లవి, సునీత, రజిత, సీసీలు గోలి కొమురయ్య, రమేశ్, వివిధ గ్రామాల వీఓల ప్రతినిధులు కట్ట రజిత, శ్వేత, నజీమా, అనిత, సరిత, మౌనిక, పద్మ, మంజుల, శోభ, వీఓఎలు బిర్రు దయాకర్, పద్మ, రమ, కవిత, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

# సమతుల ఆహారంతోనే ఆరోగ్య పరిరక్షణ



ఆహార నియమాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డాక్టర్ శ్రావణ్, తదితరులు

- ఆర్‌బీఎస్‌కే వైద్యుడు శ్రావణ్

నర్సంపేట : సమతుల ఆహారం తీసుకుంటేనే ఆరోగ్య పరిరక్షణ సాధ్యమని ప్రముఖ వైద్యుడు శ్రావణ్, మెడికల్ సూపర్‌వైజర్ సరోజ తెలిపారు. ఆశీర్వాద్ స్మార్ట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబర్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన పోషణ మేళాకు వారు అతిథులుగా హాజరై మాట్లాడారు. సమాజంలోని ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. ఐరన్, అయోడిన్ ఉన్న శుభ్రమైన ఆహార పదార్థాలను తీసుకుంటే ఆరోగ్యం మెరుగుపడుతుందని చెప్పారు. బాల్యం నుంచే పౌష్టికాహారంపై అవగాహన పెంచుకుని చైతన్యవంతం కావాలని సూచించారు. అనంతరం ఆహార నియమాల కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ లీల, హెచ్‌వీ సరోజ, విజయలక్ష్మి, ఏడీఎంసీ వహీద, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రమ, మాధవి, అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు నల్ల భారతి, జిల్లా కోఆర్డినేటర్ నల్లబెల్లి రాజు, మండల కోఆర్డినేటర్లు, విజయ్, శివాజీ, నరేశ్, లింగమూర్తి, ఉష, తదితరులు పాల్గొన్నారు.

# భక్తుల ఇంటికే 'భద్రాద్రి' తలంబ్రాలు



బుకింగ్ రశీదులను ప్రదర్శిస్తున్న డీఎం ప్రసూనలక్ష్మి, తదితరులు

- ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రసూనలక్ష్మి

నర్సంపేట : స్థానిక ఆర్టీసీ డిపో లాజిస్టిక్స్ ద్వారా భక్తుల ఇంటికే భద్రాద్రి సీతారాముల తలంబ్రాలు చేర్చుతామని డిపో మేనేజర్ ప్రసూనలక్ష్మి తెలిపారు. తలంబ్రాల బుకింగ్ రశీదులను డిపో ఆవరణలోని కార్యాలయంలో సోమవారం ఆమె ప్రదర్శించి మాట్లాడారు. ఆసక్తి కలిగిన భక్తులు ఆర్టీసీ బస్టాండ్‌లోని కార్గో లాజిస్టిక్స్ ఆఫీసులో డిపో మార్కెట్ ఎగ్జిక్యూటివ్, కార్గో ఏజెంట్ వద్ద రూ.151 చెల్లించి బుకింగ్ చేసుకోవాలని చెప్పారు. బుకింగ్ చేసుకున్న భక్తులకు కల్యాణం అనంతరం తలంబ్రాలు ఇళ్ల వద్దనే అందజేస్తామని చెప్పారు. సీతారాముల కల్యాణానికి వెళ్లలేని భక్తులు అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. తలంబ్రాల బుకింగ్ కోసం సెల్ నంబర్ 9154298763, 9704991357 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

# భూకబ్జాదారుడిపై చర్యలు తీసుకోవాలి



ఆర్‌ఐకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నర్సంపేట : పట్టణంలోని సర్వే నంబర్ 121లోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మాణం చేపట్టిన కబ్జాదారుపై చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల, పట్టణ కార్యదర్శులు కోరబోయిన కుమారస్వామి, హన్మకొండ శ్రీధర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐకి సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం కుమారస్వామి, శ్రీధర్ మాట్లాడారు. ప్రభుత్వ భూమిలో 6 ప్రభుత్వ ఉద్యోగి రాత్రికి రాత్రే నిర్మాణం చేపట్టాడని, తాము ఫిర్యాదు చేయగా పనులు ఆపాలని అధికారులు చెప్పినా సదరు కబ్జాదారు నిర్భయంగా కొనసాగిస్తున్నాడని తెలిపారు. పేదలు ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుంటే చర్యలు తీసుకుంటున్న మున్సిపల్ అధికారులు కబ్జాదారులకు కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. ఇకనైనా అధికారులు వెంటనే సదరు ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు గడ్డమీది బాలకృష్ణ, జగన్నాథం, కార్తీక్, ఐటిపాముల వెంకన్న, దాసరి నరేశ్, జాటోతు వీరన్న, పసునూరి మహేశ్, రమేశ్, నర్సింహారావు, తదితరులు పాల్గొన్నారు.